
# మంచూర్ కొత్తపాటలు



ఆదివారం పూట లేతవేట మాంసం తెప్పించి వేట పలావూ పెరుగుపచ్చడీ చేసి ఫుల్‌ప్లేటూ, సగం ప్లేటూ అని పొట్లాలు కట్టి ఆ వేడివేడి పొట్లాలు ఊళ్లో రెడ్ల ఇళ్ళల్లో ఇచ్చేసి వచ్చే కిళ్ళీరన్న డబ్బులకి రెండోరోజు వెళ్తాడు. అలా వెళ్ళినప్పుడు ''ఈరన్నా నీ పలావు చాలారుచిగా ఉందనుకో'' అని మెచ్చుకుంటుంటే నవ్వేసే కిళ్ళీరన్న ''నా పలావుదే వుందండీ వెనకటికి ఆ అరవమనిషి పలావు రుచి చూసేరంటే ఈ జన్మకి మర్చిపోరు... వంటలకంటే ముందు అసలా మనిషెంత గొప్పదనీ'' అనేవాడు.


బుల్రెడ్డి మేష్టారి పెద్దకాపు కొత్త జెటార్ ట్రాక్టరూ ట్రక్కూ కొన్నప్పుడు అందర్నీ తలుపులమ్మ లోవకి తీసుకెళ్లేడు. ట్రాక్టరు ట్రక్కు నిండా జనం. మాంచి మేకపోతూ, పోతుని అక్కడ అమ్మోరికి బలేసాక వంటలు చెయ్యడానికి కిళ్ళీరన్న. ఆ తెల్లవారు ఝామున సందడిసందడిగా

ఊరు దాటుతుంటే వూ గోలకి పొచిలు చేసే ఆడోళ్ళంతా రోజూ కంటే ముందులేచి పోయేరు.

తలుపులమ్మ లోవలో కల్లుతాగుతా కిళ్ళీరన్న వేసిన మాంసం వేపుడు తింటా రుసి భలేగుందిరా వీరన్నా అని మెచ్చుకుంటుంటే మాతో పాటు బాగా తాగేసిన వీరన్న ''నా వంటేం ఉంది అబ్బాయ్... అసలా అరవమనిషివంట ముందు నేనెంత జెప్పండి. అసలు వంట కంటే ఆ మనిషెంత గొప్పది???'' అన్నాడు.

మధ్యలోకి దూరిపోయిన బ్రాకెట్టాదిరెడ్డిగారి సత్యానందం ''ఇదే వుుక్క ఇంతకు వుుందు చాలాసార్లు చెప్పేవు ఎవరా అరవావిడ...?'' అన్నాడు.

''ఆవిడోమహాదేవత... మహాతల్లి. ఇవేళ ఈ చేత్తో అన్నం తింటన్నావంటే ఆ తల్లి పెట్టిన బిక్షే ఆ తల్లి నేర్పిన వంటే'' అని వీరన్న మాటాడ్తుంటే మా కుర్రాళ్ళలో కేకలు కొంచెం తగ్గాయి. కల్లు నిషా దిగింది. వీరన్న



చెప్పబోయేది వినాలన్న ఆరాటం పెరిగింది.

''ఆ అరవమనిషెవరో కొంచెం చెప్పమన్నాడు'' పెద్దకాపు.

ఆకాశం కేసి తిరిగి దణ్ణం పెట్టుకున్న కిళ్లీరన్న ''ఇది చాలా ఏళ్ళ కిందటి మాట. ఇప్పుడు నా వయసెంత ఉంటది?'' అడిగేడు కుర్రోళ్ళని.

''ఓ నలభై అయిదుండవూ?'' అన్నాడు బ్రాకెట్టాదిరెడ్డిగారి సత్యానందం.

నవ్వేసిన కిళ్ళీరన్న ''ఏభై అయిదు...అప్పుడు నా వయసు అయిదే అయిదు..ఇప్పుడు నేను చెప్పబోయేది ఏభై ఏళ్ళ క్రితం కథ... కొంచెం కల్లు పోయండి'' అన్నాడు.

పోసేరు.

తాగేసేక మొదలెట్టేడు.

''ఆళ్ళు అరవోళ్ళు... ఆ మనిషి పేరు శివగామి. ఇప్పుట్లా కాలవగట్టు మీద ఆంజనేయస్వామి గుడి, గుడ్డిపట్టాభి కిళ్ళికొట్టూ, గోపాల్రావు కాఫీహొటలూ, పట్టాభిరావయ్య షోడా కొట్టూ ఉండేవిగాదప్పుడు. ఒకే ఒక కాఫీ ఒటేలుండేది. సాయంత్రం పూట టీ తాగడానికొచ్చే లైబ్రరీ మేష్టారు. దానికి మలబారు కాఫీ హొటలు అని పేరెట్టేరు.

శివగామి చాలా అందగత్తె. మగోడ్ని రెచ్చగొట్టే అందంగాదు ఆ మనిషిది. చూసినోడు చాలా పవిత్రంగా పూజ చేసే అందం. చామనచాయ. పెద్ద పెద్ద కళ్ళు. ఏడుగజాల నేత చీర శరీరమంతా కప్పుకునేది.

తెల్లవారురుఝామున రెండింటికే హొటేలు తెరిచేసేది శివగామి. పాసింజర్లు పడవలోళ్ళు, ముగ్గుపడవలోళ్ళు, ఉప్పునావ మంగయ్యా ఆరారా టీ తాగేద్దావని కాచుక్కూచునే వారు.

తెలతెలవారేసరికి ఒటేలు ముందు ఒకటే తొడతొక్కిడి. గల్లాపెట్టి దగ్గర కూర్చున్న శివగామికి డబ్బులు తీసుకోవడానికే విసుగ్గా ఉండేది. అంతమంది జనం. మేం బ్రాహ్మలం మాకు మడి, మేం రెడ్లం మేం పాక హొటేల్లోవి తినం హ దర్జావేరు లాంటి మాటలు ఎక్కడా వినపడేయి కాదు. ఊళ్ళో అంతా మలబారు కాఫీహొటేలుకి వచ్చేవారు. అరవమనిషి అయిటమ్సు అమృతం లాగుండేయి.

చల్దిపొద్దు దాటేలోపే ఒటేలు మూసేసేది. సరిగ్గా అప్పుడు లేచేవాడు ఆవిడ మొగుడైన బాలన్ నాయరు. ఆడు పొలాల దగ్గర నీళ్ళు తోడే పంపులు బాగు చేస్తాడు. ఆ పన్లో బాగా గట్టోడు. వయసులో శివగామికంటే కుర్రోడు. పెద్దగళ్ళ శంకం మార్కులుంగీ, మొలకి పటకా, పెద్దపెద్ద బొర్రులుండే ఎరుపు, పసుపూ లేసు బనేన్లూ వేసుకునేవోడు. మీసాల్ని మెలి తిప్పేవోడు.

నిద్రలేచిన వెంటనే మంగుళూరు బీడీ వెలిగించి టీ అనరిచేవోడు. అగ్గగ్గలాడతా పట్టుకెళ్ళి ఇచ్చేది. ఆ టీలో డికేషన్ తక్కువైనా పంచార తక్కువైనా ముఖం మీదేసేవోడు. ఓసారయితే శివగామి ముఖమంతా కాలి బొబ్బ లెక్కింది.

మధ్యాన్నం నాయరుకోసం ఉప్పుడు బియ్యం అన్నం, కాల్చినఎండి చేపుముక్కా, పెరుగు పులుసు చేసేది. అదంటే బాగా ఇష్టం ఆడికి.

ఇంతా జేస్తే ఆ వయసులో వున్న నాయరు మళయాళపోడట. ఈ శివగామి అరవ మనిషట. అసలాడు నిద్రలేస్తాడనే బోల్డు బిగినెస్సు ఉన్నా కట్టేస్తది. ఇదంతా చేసేదీ, ఇవన్నీ భరించేదీ ఆ నాయరుగాడంటే భయం వల్ల కాదట. ఇష్టం వల్లట. ఆడికోసం చాలా

చేసిందట. అసలు ఈ ప్రాంతానికి రావడం ఆడికోసమేనట.

* * *

హొటల్లో వారానికి కావాల్సిన సరుకులు పెద్ద రిక్షాలో రాంపురం వెళ్ళి సోమవారం ఖరీదు చేసుకొస్తది శివగామి.

ప్రతివారం లాగే ఆదివారంకూడా ఖరీదుకెళ్ళి వచ్చిన శివగామి హొటలు పాకముందు కూర్చునున్న ఆ కేశవన్‌ని చూసి అవాక్కయి చూస్తుండిపోయింది. మాసిపోయిన పెద్ద గళ్ళలుంగీ, జబ్బదగ్గర చిరిగిపోయిన లూజు చొక్కా, జుట్టూ గెడ్డం బాగా పండిపోయినియ్యి. మనిషి బాగా వడిలిపోయేడు. గబగబా దగ్గరకెళ్ళి "ఎన్నాంగో..నీంగదానే" అని పలకరించి లోపలికి తీసుకెళ్ళిపోయింది కేశవన్‌ని.

హొటల్లో పనిచేసే కిళ్ళీరన్నని యర్రమిల్లివెంకట్రాజు బట్టల దుకాణానికి పంపించి ఒక పంచా లాల్చీకి సరిపోయే గుడ్డ చింపించి తెప్పించింది. మిష్షనుకుట్టు ఎంకారెడ్డికి కబురెట్టి గుడ్డ తడపకుండా వెంటనే లాల్చీ కుట్టించెయ్యమని బతిమాలింది. పుత్రయ్యని పిలిపించి కేశవన్‌కి దగ్గరగా కత్తిరింపేసి నున్నగా గెడ్డం గియ్యమంది.

గబగబా పొయ్యి దగ్గరకెళ్ళి కేశవన్‌కి ఇష్టమైన చిన్న ఉల్లిపాయల సాంబారూ, కేబేజీ కూటు తయారు చేసి వడ్డిస్తుండగా దిగేడు బాలన్ నాయర్. చాలా కంగారుపడిపోయింది శివగామి. కేశవన్‌ని ఎక్కడ చూసేస్తాడో అని ఒకటే కంగారు.

సైకిలు దిగిన నాయర్ రెంచిలు వేసే కాకీసంచి ఎక్కడా అని లోపలకొస్తుంటే అతన్నాపి నే తెచ్చిస్తానని గబగబా వెళ్ళి తెచ్చిచ్చింది.

దిండుకింద బీడీకట్ట ఉందని మళ్ళీ లోపలికి రాబోతుంటే ఆపి తనెళ్ళి తెచ్చిచ్చింది.

చొక్కా మాసిపోయింది. మార్చుకుంటానని లోపలికొస్తుంటే వద్దొద్దని ఆపి ఇస్త్రీ గళ్ళ చొక్కాతీసుకొచ్చింది.

ఎందుకలా లోపలికెళ్ళనియ్యకండా ఎందుకిలా ఆపుతుంది అన్న అనుమానం రాలేదుగానీ ఏంటీ మనిషి ఇయ్యాళ? అనుకుంటా సైకిలెక్కి ఇక వెళ్ళబోతుంటే లోపల్నుంచి వినిపించింది దగ్గు.

అది విని ఆగిన నాయర్ సైకిలు దిగి లోపలికొస్తుంటే ఒకటే కంగారు శివగామికి. చెమట చారలు కంఠం దగ్గర్నుంచి దిగి లోపల చాతీ లోకెళ్ళిపోడం జాకెట్టు తడిసిపోతుంది. మొకాళ్ళ మీద ఒణుకు నిలబడలేకపోతుంది. లోపలికొచ్చిన నాయర్ అరిటాకు ముందుకూర్చుని ఆబగా భోజనం చేస్తున్న కేశవన్‌ని శివగామినీ చూసేడు. ముఖమంతా చెమట్లు. తిన్నగా అతన్ని చూళ్ళేక పాక చూర్లోకి చూస్తుంది.

రాత్రయ్యింది.

వంతెనకింద సత్రంలో అన్నపూర్ణకావిడి సాధువు కావిడికుండే చిన్ని గంటలు మోగించుకుంటా ఊళ్లో కొస్తున్నాడు. మండపేట వేపెళ్ళే పాసింజరు పడవ తాడు నెమ్మదిగా లాగుతున్నారు ముగ్గురు జనం. కాలవ దగ్గరంతా చీకటి. చీమ చిటుక్కుమనడం లేదు. శివగామి కాఫీహొటేలు ముందు మట్టుకి మసి పట్టిన లాంతరు నెమ్మదిగా ఊగుతుంది గాలికి. ఆ లాంతరు కిందే దొంతిరికాళ్ళమీద కూర్చున్న శివగామి ఇప్పుడు తాగొచ్చి ఏంగొడవ చేస్తాడో భయపడతా ఉంది.

ఆ మనిషి అనుకున్నట్టే అయ్యింది.

తాగొచ్చిన నాయరుగాడు చాలా గందరగోళం చేసేడు. మళయాళంలో పచ్చిబూతులు తిడతా చితకబాదుతానే ఉన్నాడు. కర్రతో బాదుతా ఉంటే ఆ కముకు దెబ్బలు భరిస్తుంది కానీ, కిక్కురు మనలేదు పైకి. రాత్రంతా ఆ దెబ్బలు భరించి మళ్ళీ తెల్లవారు ఝామున హొటేలు తెరిచేసింది.

ఆ తర్వాత నించి అప్పుడప్పుడొచ్చే కేశవన్‌కి ఆరారా వండి వడ్డించేది. బట్టలు కావాలంటే ఇచ్చేది. ఎప్పుడైనా నాయరు కంటబడితే ఆరాత్రి వాడు తిట్టేబూతులూ దెబ్బలూ భరించేది.

రెండుమూడు నెలల తర్వాత ఒకమిట్ట మధ్యాన్నం వేళొచ్చిన కేశవన్‌ని చూసి గుర్తు పట్టలేదు. సన్నగా తేగతొక్కలాగయిపోయేడు మనిషి. మాటకూడా చాలా కష్టంగా వస్తుంది.

అయిదు నిమిషాలపాటు అరవంలో మాటాడి ఏదో చెప్పేడు. అంతే... బోరుమంటా ఏడుస్తా ఊళ్లోకెళ్ళి కోరి శేషమ్మ దగ్గర తన నగలన్నీ తాకట్టు పెట్టి అయిదువేలు తెచ్చి కేశవన్‌కిచ్చింది.

ఆ సంగతి బాలన్ నాయరుకి తెల్సింది. చావబాదేసేడు. కిక్కురు మనకుండా భరించింది.

ఒకనెలరోజులు తర్వాత హొటేలు కట్టేసి ఎవరికీ చెప్పకండా ఎక్కడికో వెళ్ళిపోయింది.

కొన్నాళ్ళ తర్వాత ఊళ్ళోకి దిగిన శివగామిని ''ఎక్కడికెళ్ళేవు'' అన్నాడు నాయరు.

'కేవవన్‌కి కేన్సరు'' అంది శివగామి.

''అంత చక్కటిమనిషిఆ తప్పెందుకు చేసింది?'' అనడిగేడు పెద్దకాపు.

పెద్దనవ్వు నవ్వేసిన కిళ్ళీరన్న ''ఆ శివగామి తప్పు చేస్తే ఈ కథ మీకు చెప్పను అసలు రహస్యం ఇప్పుడు చెప్తున్నాను వినండి..ఆ కేశవన్ అరవోడు శివగామి మొగుడు. ఈ పంపుసెట్లు బాగు జేసే నాయరుగాడు మళయాళపోడు శివగామికి రెండోవోడు'' అన్నాడు.

''ఏంటీ???'' అన్నాడు నాగేంద్రప్రసాదు.

''అవును...ఎందుకు చేసిందో భర్త కేశవన్‌తో ఒకరోజు గొడవ పడ్డప్పుడు ఆ పౌరుషంలో ఒకరాత్రి నాయర్‌తో తప్పు చేసింది. ఆ ఒక్కతప్పే జన్మలో చేసిన పెద్దతప్పు పెద్ద పాపం అనుకుంది. అది అలుసుగా తీసుకుని ప్రతీరోజూ బాధపెట్టేవోడీ నాయరు. ఒకరోజు శివగామిని కల్సిన నాయరు నీకు భర్త ఉన్నాడు నాకు భార్యాపిల్లలున్నారు. వీళ్ళని వదిలేసి ఎక్కడికయినా వెళ్ళిపోదాం... అయితే నేను నా పెళ్ళాం పిల్లల ఊసెత్తను. నువ్వు నీ మొగుడు ఊసు ఎత్తను అని మాటియ్యి అన్నాడు... ఇచ్చింది శివగామి... ఆ మర్నాడే ఆళ్ళిద్దరూ ఆళ్ళ దేశం వదిలి మనూళ్ళో పడ్డారు'' అన్నాడు కిళ్ళీరన్న.

''మరి నాయర్‌కి హాటిచ్చిన శివగామి ఆ కేశవన్‌ని ఎందుకు చేర దీసింది?'' అడిగేడు పెద్దకాపు.

''ఆ కేశవన్ ఇంక ఎన్నాళ్ళో బతకడని తెలిసి ఆ పూటకి అన్నం పెట్టింది ఇందులో తప్పేం ఉంది... ఇందులో పాపం ఏం ఉంది??'' అడిగేడు కిళ్ళీరన్న.

* * *